వెంటాడుతున్న 'ఫెంగల్'



క్రిష్టిపాడులో వరిధాన్యంపై పట్టలు కప్పుతున్న రైతు



డబ్ల్యూ గోవిందిన్నె పొలాల్లో కందిపూత నేలరాలిన దృశ్యం

దొర్నిపాడు: గత వారం నుంచి ఫెంగల్ తుపాను రైతులను వెంటాడుతోంది. చేతికొచ్చిన వరి పంట రైతులకు తీవ్రనష్టాలను మిగిల్చింది. వర్షానికి పంటతా నేలమట్టం కావడంతో గింజలు నేలరాలుతున్నాయి. అలాగే కంది పంట ప్రస్తుతం పూత దశలో ఉంది. ఈ సమయంలో వర్షం కురవడంతోపాటు గాలి వీస్తుండటంతో పూత రాలిపోతోంది. అలాగే శనగ పంట కూడా పూత దశలో ఉంది వర్షం కారణంగా పూత రాలిపోయే ప్రమాదముందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రుద్రవరం: మండలంలో మంగళవారం తెల్లవారు జాము నుంచి రాత్రి వరకు వదలకుండా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో వ్యవసాయ పనులు ఎక్కడివక్కడ నిలిచిపోయాయి. ఈదురు గాలులు వీస్తుండటంతో కోత దశలో ఉన్న వరి పైరు నేలవాలుతోంది. రోడ్లపై ఆరబోసిన ధాన్యం తడవకుండా ఉండేందుకు రైతులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. వర్షం కురుస్తూనే ఉండటంతో విద్యార్థులు బడికి వెళ్లేందుకు, తిరిగి ఇళ్లకు చేరుకునేటప్పుడు తలలపై సూపర్ పట్టలు కప్పుకొని వెళ్లారు.



రుద్రవరంలో వర్షంలో తడవకుండా పట్టలు కప్పుకొని వెళ్తున్న విద్యార్థులు

క్లుప్తంగా

ఇరుముడితో శబరిమలకు



ఇరుముడితో శబరిమలకు బయలు దేరుతున్న అయ్యప్ప మాలధారులు

దొర్నిపాడు: మండల కేంద్రంలో పలువురు అయ్యప్ప మాలధారులు మంగళవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి ఇరుముడి స్వీకరించారు. అనంతరం విశేష పూజలు, భజనలు చేసి శబరికి బయలుదేరారు. స్థానిక కోటస్కూల్ ఆవరణలో ఇరుముడి ధరించి కుటుంబ సభ్యులంతా వీడ్కోలు పలుకగా.. వేళతాళాలతో ఊరేగింపుగా బయలుదేరారు.

రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి



పత్తి పొలంలో పొలంపిలుస్తోంది నిర్వహిస్తున్న అధికారులు, రైతులు

దొర్నిపాడు: పంటలసాగులో రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని జిల్లా వనరుల కేంద్రం ఏఓ చంద్రశేఖర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి ప్రమీల సూచించారు. మంగళవారం మండలంలోని కొండాపురం, దొర్నిపాడు గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రసాయన ఎరువులు వాడకం వల్ల నేల సారం తగ్గిపోతుందన్నారు. ఇందుకు ప్రత్యామ్నాయంగా రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. రసాయన ఎరువుల వాడకంతో భవిష్యత్తులో నేల తన స్వభావాన్ని కోల్పోతుందన్నారు. పత్తి రైతులు పంటయాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. కురుస్తున్న వర్షాలకు పంటలకు దెబ్బతినకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రత్నకుమారి

ఆళ్లగడ్డ : నీటి సంఘాల ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ రత్నకుమారి సూచించారు. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో మంగళవారం పోలింగ్ అధికారులకు నీటి సంఘాల ఎన్నికలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 5వ తేదీన ఎన్నికల ప్రకటన వెలువడనుండగా 8న ఒకే రోజు నామినేషన్ల ప్రక్రియ, ఆరుగురు ప్రాదేశిక సభ్యులు, అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికలను సమర్థంగా నిర్వహించడానికి అధికారులు ప్రణాళిక రూపొందించుకోవాలని చెప్పారు.

అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై ఎమ్మిగనూరుకు చెందిన నటరాజ కూచిపూడి నృత్య సంస్కృతి కళాక్షేత్రం వారిచే సంప్రదాయ నృత్యం ప్రదర్శించారు. కార్యక్రమంలో గణపతి ప్రార్థన, భో శంభో, శివాష్టకం, లింగాష్టకం, కాలభైరవాష్టకం, కనకధారాస్తోత్రం, ఆనందతాండవం తదితర గీతాలకు, అష్టకాలకు మనస్విని, మీనాక్షి, లిక్షిత, లాస్య, మౌనిక, చంద్ర, వినిత, శ్రావణి, ప్రీతి తదితరులు నృత్యం చేశారు.

కుమారస్వామికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో కుమారస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

పర్యావరణాన్ని రక్షించుకుందాం

మహానంది: పర్యావరణాన్ని పరిరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, పర్యావరణం దెబ్బతింటే భవిష్యత్ తరాలను మరింత ముప్పు తప్పదని మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వీర జయలక్ష్మి అన్నారు. జాతీయ సేవా పథకంలో భాగంగా నాలుగవ రోజు అల్లినగరం గ్రామంలో వ్యవసాయ విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ మేరకు డాక్టర్ వీర జయలక్ష్మి విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

వర్షానికి ముందు కోతలొద్దు

కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటను వర్షానికి ముందు కోయవద్దని ఏఓ నాగేశ్వర రెడ్డి సూచించారు. సీతారామపురం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన కోత కోసి పొలంలో ఉన్న పన్నులు వర్షానికి తడిచినట్లయితే మొలకెత్తకుండా ఉండేందుకు ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు.

ఏపీ మోడల్ స్కూల్ తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(అర్బన్): మండలంలోని మిట్నాల ఏపీ మోడల్ స్కూల్‌ను జిల్లా కలెక్టర్ రాజకుమారి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పదవ తరగతి విద్యార్థులతో ముచ్చటిస్తూ భవిష్యత్‌లో ఏ కోర్సు చేయాలనుకుంటున్నారు, పాఠశాలలో బోధన ఎలా ఉంది.., మెనూ ప్రకారం భోజనం ఇస్తున్నారా తదితర విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో టాయిలెట్లు బాగున్నాయా, రన్నింగ్ వాటర్ వస్తుందా తదితర విషయాలపై ఆరా తీసి వాటిని పరిశీలించారు. గత సంవత్సరం పదవ తరగతి పరీక్షల ఉత్తీర్ణత శాతం, విద్యార్థుల హాజరు సంబంధిత రికార్డులను పరిశీలించి సిబ్బందితో వివరాలు తెలుసుకున్నారు. తరగతి గదులను, వంటశాలను, స్టోర్ రూంను తనిఖీ చేశారు. మిట్నాలలో నూతనంగా నిర్మిస్తున్న మోడల్ స్కూల్ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పాఠశాలలో తరగతి గదులతో పాటు వంటశాల, టాయిలెట్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

యాజమాన్య పద్ధతులతో తెగుళ్ల నివారణ



ఉయ్యాలవాడలో మిరప పంటను పరిశీలించి రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త బాలరాజు

ఉయ్యాలవాడ : మిరప పంట సాగు చేసిన రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించి పంటను కాపాడుకోవాలని బనగానపల్లె కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త బాలరాజు రైతులకు సూచించారు. మంగళవారం ఉయ్యాలవాడలో మిరప పంటను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ మిరపకు సోకిన తెగుళ్లను నివారించుకునేందుకు సస్యరక్షణ పద్ధతులు చేపట్టాలన్నారు. తామర పురుగు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. నివారణకు ఎకరాకు 50 -100 వరకు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే వేప నూనె ఒక మిల్లీలీటర్‌ను లీటర్ నీటిలో కలిపి పంటపై పిచికారీ చేయాలన్నారు. కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ మండలాల్లో ఒకే పంట మిరప సాగు చేస్తుండడంతో తెగుళ్ల అధికంగా ఆశించాయని చెప్పారు. మిరప రైతులు రబీ సీజన్‌లో ఫసల్ బీమా కింద పంట నమోదు చేయించుకొని ప్రీమియం చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో కోవెలకుంట్ల ఉద్యానవన శాఖ అధికారిణి ధరిణి, గ్రామ వ్యవసాయ సహాయకురాలు సరళ పాల్గొన్నారు.

పారదర్శకంగా సాగు నీటి సంఘాల ఎన్నికలు

ఉయ్యాలవాడ : సాగు నీటి సంఘాల ఎన్నికలు మండలంలో పారదర్శకంగా నిర్వహించేందుకు సిబ్బంది బాధ్యతగా పని చేయాలని తహసీల్దార్ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం ఎన్నికల నిర్వహణపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పోలింగ్ సిబ్బందితో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండల పరిధిలో చెరువులు, కేసీ కాలువ, ఎస్సార్బీసీ ఆయకట్టు కింద 9 సంఘాలకు ఎన్నికలు జరగనున్నట్లు పేర్కొన్నారు. ఈ సంఘాల పరిధిలో 62 డబ్ల్యూఏ (టీసీలు) ఉన్నాయన్నారు. వీరి ఎన్నిక కోసం ఎన్నికలు నిర్వహించేందుకు పీఓ, ఏపీఓలతో కలిపి 200 మంది సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. తుడుమలదిన్నె, రూపనగుడి, హరివరం, ఉయ్యాలవాడ, పెద్దయమ్మనూరు, మాయలూరు, అల్లూరు గ్రామాలలో పై సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ నెల 5న అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ, 6న పరిశీలన, 7న ఉప సంహరణ ఉంటుందన్నారు. 8న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఎస్సార్బీసీ ఏఈ ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు, ఈఓఆర్‌డీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ



కాళికాంబ అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన కాలికాంబ చంద్రశేఖర దేవస్థానంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూల విరాట్‌కు ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, నిమ్మ, వేప రసాలతో అభిషేకాలు చేసి పట్టు వస్త్రాలతో అలంకరించి వివిధ రకాల పూలతో పూలంగి సేవ చేపట్టారు. అమ్మవారికి వడిబియ్యం కార్యక్రమం నిర్వహించి, 108 వెండి పుష్పాలతో అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. అలాగే.. సంజీవ్ నగర్ రామాలయంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామికి శ్రీ భగవత్ సేవ సమాజా ఆధ్వర్యంలో అష్టాదళ పాదపద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. సూరయ్య శ్రీనివాసులు మధుసూదన్ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకించండి

నంద్యాల(న్యూటౌన్): పెరిగిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని, విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపును ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులు మహమ్మద్‌గౌస్ కోరారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కమర్షియల్‌గా ఉన్న 2లక్షల దుకాణాలకు, ఫ్యాక్టరీలకు బిగించారని, రానున్న రోజుల్లో ప్రతి ఇంటికి బిగించేందుకు సిద్ధమవుతున్నరాని, ప్రజలు తిరగబడాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం స్పందించి వ్యతిరేకత రాకముందే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

వరి పంటను కాపాడుకోండి

చాగలమర్రి: వరి పైరు కోత దశలో ఉండటంతో తుఫాన్‌కు పంట దెబ్బ తినకుండా కాపాడే చర్యలు చేపట్టాలని ఏఓ రంగనేతాజీ సూచించారు. చాగలమర్రి, నగళ్లపాడు గ్రామాల్లోని రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తుఫాన్‌కు పంట నేల వాలకుండా వరి దుబ్బులను కట్టలు కట్టి, వరి గింజలు నీళ్లలో తడవకుండా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే వరిమడిలో నీళ్లు నిల్వ ఉండకుండా కాల్వలు ఏర్పాటు చేసి వర్షపు నీటిని బయటకు పంపాలని చెప్పారు. అధిక వర్షాలకు తడిసిన వరి ధాన్యంపై 5 శాతం ఉప్పు ద్రావణం నీళ్లల్లో కలిపి పిచికారీ చేయాలన్నారు. పంట బీమాకు ప్రీమియం మొత్తాన్ని ఈ నెల 15వ తేదీ లోపు చెల్లించాలని తెలిపారు.

పీఎం సూర్య ఘర్‌ను సద్వినియోగం చేసుకోండి

ఆళ్లగడ్డ : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకాన్ని గృహ వినియోగదారులంతా సద్వినియోగం చేసుకోవాలని ఏడీఈ రవికాంత్ చౌదరి అన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన పథకం వివరాలను వెల్లడించారు. సౌరవిద్యుత్ వాడటం వల్ల 300 యూనిట్ల వరకు విద్యుత్ చార్జీల మినహాయింపు ఉంటుందన్నారు. సోలార్ సిస్టం ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌లో మొదటి 300 యూనిట్లు లబ్ధిదారుడ సొంత అవసరానికి వాడుకోవచ్చని మిగిలిన 600 యూనిట్లు నెట్ మీటరింగ్ ద్వారా అమ్ముకోవచ్చని చెప్పారు.

రైతుకు పాము కాటు

చాగలమర్రి: మండలంలోని మల్లెవేముల గ్రామానికి చెందిన రైతు నరసింహారెడ్డి మంగళవారం ఉదయాన్నే వరి మడి గట్టుపై నుంచి పొలాన్ని పరిశీలిస్తుండగా పాము కాటుకు గురైనట్లు బాధితుడు తెలిపారు. వెంటనే కుటుంబ సభ్యుల సహాయంతో స్థానిక కేరళ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు మాట్లాడుతూ పరిస్థితి అదుపులోనే ఉందని, రెండు రోజుల పాటు చికిత్స పొందాలని సూచించారని కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రోగ్రెస్ రిపోర్టు కార్డుల పంపిణీ



ప్రధానోపాధ్యాయులకు కార్డులను అందజేస్తున్న ఎంఈఓలు అనురాధ, న్యామతుల్లా

చాగలమర్రి: ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభను తల్లిదండ్రులకు తెలియజేందుకు ప్రభుత్వం హోలిస్టిక్ ప్రోగ్రెస్ రిపోర్టు కార్డులను ఈ విద్యా సంవత్సరం నుంచి అందజేయనుందని ఎంఈఓలు అనురాధ, న్యామతుల్లా తెలిపారు. మంగళవారం స్థానిక ఎంఆర్‌సీ భవనంలో పెద్దబోధనం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కాత్యాయినికి కార్డులను అందజేశారు. వారు మాట్లాడుతూ మండలంలోని 46 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులకు 5,200 ప్రోగ్రెస్ రిపోర్టు కార్డులను ప్రభుత్వం మంజూరు చేసిందని, వాటిని ఇప్పటికే ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేశామని చెప్పారు. పీఈటీ ఆశాజ్యోతి, ఎంఆర్‌పీలు నారాయణస్వామి, అమీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నాస్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న డీఈఓ జనార్దన్ రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 4వ తేదీన జరిగే నాస్-2024 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఈఓ జనార్దన్ రెడ్డి సూచించారు. మంగళవారం పరీక్షల అబ్జర్వర్లకు ఆర్‌జీఎం ఇంటర్నేషనల్ స్కూల్‌లో సమావేశం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ అబ్జర్వర్లకు నాస్ ప్రాముఖ్యతను వివరిస్తూ పరీక్ష నిర్వహించాల్సిన విధి విధానాలను తెలియజేశారు. సరైన సమయాల్లో గుర్తించిన పాఠశాలల్లో కాన్ఫిడెంటల్ మెటీరియల్‌ను చేర్చి ఎఫ్ఐలకు అందించి పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎటువంటి తొందరపాటు లేకుండా విద్యార్థులకు తగు సమయాన్ని ఇచ్చి పరీక్ష రాయించాలని చెప్పారు. పోస్ట్ మెటీరియల్, ఆర్‌జీఎం స్కూల్‌లో అందజేయాల్సిన బాధ్యత అబ్జర్వర్లదేనన్నారు. నంద్యాల జిల్లా సర్వశిక్షా అభియాన్ అధికారి లలితకుమారి, డీసీఈబీ సెక్రటరీ శ్రీనివాస రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, యూనిస్‌బాషా, వెంకట ప్రసాద్ పాల్గొన్నారు.

మెగా పీటీఎం నిర్వహణకు నిధులు మంజూరు

చాగలమర్రి: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను నిర్వహించేందుకు మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహణకు మండలంలోని 46 పాఠశాలలకు రూ.1,10,400 మంజూరయ్యాయని ఎంఈఓలు అనురాధ, న్యామతుల్లా మంగళవారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఈనెల 7వ తేదీన ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహించనుందని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులకు స్వాగతం, విద్యార్థుల ప్రతిభపై వివరణ, తల్లిదండ్రులకు ముగ్గుల, బలప్రదర్శన ఆట, తల్లుల ఆధ్వర్యంలో సమావేశం, పాఠశాల ప్రగతిపై హెచ్‌ఎం నివేదిక, ఎస్‌ఎంసీ, తల్లులతో ప్రసంగం, తగిన సూచనలు చేయుట, తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ, సహపంక్తి భోజనం తదితర కార్యక్రమాలను నిర్వహించి, విద్యార్థుల తల్లిదండ్రులకు వారి పిల్లలు విద్యాభ్యాసంలో చూపిన ప్రతిభకు సంబంధించిన ప్రోగ్రెస్ రిపోర్టు కార్డులను పంపిణీ చేస్తారని వివరించారు. విద్యార్థుల సంఖ్యను బట్టి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు నిధులు అందజేసినట్లు చెప్పారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు సురక్షితం



మాట్లాడుతున్న డాక్టర్ అంజలి

చాగలమర్రి: ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవం సురక్షితమని, ఈ దిశగా గర్భిణులకు ఏఎన్‌ఎంలు, ఆశాలు అవగాహన కల్పించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.అంజలి సూచించారు. ఆశా డే సందర్భంగా పీహెచ్‌సీలోని సమావేశ భవనంలో నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్న ఆళ్లగడ్డ ఐసీడీఎస్ సీడీపీఓ తేజేశ్వరి మాట్లాడుతూ గర్భిణులు సమీపంలోని పీహెచ్‌సిల్లో ప్రసవం అయ్యేటట్లు చూడాలన్నారు. వైద్యారోగ్య సిబ్బంది నిర్వహిస్తున్న ఎన్‌సీడీసీ సర్వేలో అందరూ పాల్గొనేటట్లు ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించాలన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ కౌన్సిలర్ మాధవి, ఎంపీహెచ్‌ఈఓ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ శివరామలింగారెడ్డి, సిహెచ్ఓ రవణమ్మ, పాల్గొన్నారు.

6నుంచి పాలిటెక్ ఫెస్ట్



పాలిటెక్ ఫెస్ట్ లోగోను విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 6,7తేదీల్లో ఎస్‌బీయూ రీజినల్ జాయింట్ డైరెక్టర్ నిర్మల కుమార్ పర్యవేక్షణలో పాలి టెక్ ఫెస్ట్ నిర్వహిస్తామని నంద్యాల ప్రభుత్వ ఈఎస్సీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 12 ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన 317మంది విద్యార్థులు సివిల్ ఇంజినీరింగ్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, మెకానిక్ ఇంజినీరింగ్ విభాగాల్లో నూతన ఆవిష్కరణలను ప్రదర్శిస్తారన్నారు. కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాలోని మంత్రులు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు చెప్పారు. ఇంటర్, వొకేషనల్, ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు కూడా హాజరు కావాలని సూచించారు. వివరాలకు సురేష్‌బాబు సెల్ : 9912377723 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బీమాను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న సునీల్

నంద్యాల(అర్బన్): రైతుల సంక్షేమం కోసం భారత ప్రభుత్వం తెచ్చిన పీఎం ఫసల్ బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా నంద్యాల జిల్లా ఇన్‌చార్జ్ సునీల్ తెలిపారు. మండలంలోని పెద్దకొట్టాల గ్రామ రైతు సేవా కేంద్రంలో మంగళవారం పంటల బీమాపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాతావరణ ఆధారిత పంట అయిన మామిడి పంటకు ఎకరాకు రూ.2,250 చెల్లించి బీమా పొందాలన్నారు. కార్యక్రమంలో కంపెనీ అధికారులు వినయ్‌కుమార్, నరేంద్ర, పవన్, వీహెచ్‌ఏ షర్మిల, మాధురి, రైతులు పాల్గొన్నారు.

పంటల బీమా ప్రీమియం చెల్లించాలి

ఆళ్లగడ్డ: రబీ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతులు అందరూ పంటల బీమా ప్రీమియం చెలించాలని ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక వ్యవసాయ సబ్‌డివిజన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పంటసాగు చేసిన ప్రతి రైతులు ఈ -క్రాప్ నమోదు చేయించుకుని ఈ నెల 15వ తేదీ లోపు సాగు చేసిన పంటలకు బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. బీమా సమాచారం కోసం రైతు సేవా కేంద్రాల్లోని వీఏఏలను సంప్రదించాలని చెప్పారు. ప్రకృతి వైపరిత్యాలు సంబవించినప్పుడు బీమా చెల్లించిన వారికి మాత్రమే పరిహారం వస్తుందని పేర్కొన్నారు.

భవిత కేంద్రాలతో బంగారు భవిష్యత్



దివ్యాంగులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న ఎంఈఓలు



దివ్యాంగులకు కుట్టు మిషన్లు, చక్రాల కుర్చీలు, వినికిడి యంత్రాలు, దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం



దివ్యాంగులకు బహుమతులను అందజేస్తున్న ఎంఈఓ

దొర్నిపాడు: దివ్యాంగులకు భవిత కేంద్రాల్లో బంగారు భవిష్యత్ లభిస్తుందని ఎంఈఓలు మనోహర్ రెడ్డి, రామచంద్రయ్య అన్నారు. మంగళవారం దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక భవిత కేంద్రంలోని దివ్యాంగులకు నిర్వహించిన ఆటల పోటీలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ..భవిత కేంద్రంలోవారికి ఫిజియోథెరపీ నిర్వహించి నడవడికలో మార్పులు తీసుకవస్తున్నారన్నారు. ఆట వస్తులు గుర్తించడం, అక్షరాలు దిద్దడం వంటివి గతంలో కంటే భవితకేంద్రాల్లో చేరాకా పురోగతి కనిపిస్తోందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఐఈఆర్పీలు రాజేశ్వరి, శరణ్య పాల్గొన్నారు.

నంద్యాల(వ్యవసాయం): ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక పురపాలక టౌన్ హాల్‌లో నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో, ఐఎంఏ లయన్స్ క్లబ్ సహకారంతో మంగళవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, అధ్యక్షుడు సుబ్బారెడ్డి, కోఆర్డినేటర్ ఎం.పీ.వి. రమణయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వెయ్యి మందికి నూతన దుస్తులు, ఏడు కుట్టు మిషన్లు, చక్రాల కుర్చీలు మూడు, 8 వినికిడి యంత్రాలు, 15 చంక కర్రలు, 10 మందికి విద్యార్థులకు రూ.1500 చొప్పున ఉపకార వేతనాలు, దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న 12 మంది కి నెలవారి మందులు, నంద్యాల పరిసర ప్రాంతాల్లో ఉన్న ఆరు ప్రత్యేక పాఠశాలల బాలలకు 300 నిత్యావసర వస్తువుల కిట్లు, 10 మందికి ఐఎంఏ ఉచిత ఆరోగ్య కార్డులు పంపిణీ చేశారు. రామకృష్ణారెడ్డి , డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి, డాక్టర్ మధుసూదనరావు, వెదుర్ల రామచంద్రరావు, మౌలాలి డాక్టర్ లక్ష్మీ సౌజన్య, డాక్టర్ కల్పన, డాక్టర్ రాకేష్ రెడ్డి, డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, భవనాసి వాసు, నాగ మహేష్, డాక్టర్ పనీల్, వర్ధన్ శెట్టి రాజారాం, డాక్టర్ నర్మద పాల్గొన్నారు.

చాగలమర్రి: దివ్యాంగులను గౌరవించాలని ఎంఈఓలు అనురాధ, నామతుల్లా అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో ఐఈఆర్పీ ఉపాధ్యాయులు ఎస్. జగదీష్, మారెన్న ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మహబూబ్ హుసేన్ పాల్గొన్నారు.

రుద్రవరం: స్థానిక భవిత కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు.ఎంఈఓ కోటయ్య, జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుబ్బరాయుడు, ఆలమూరు ప్రత్యేక పాఠశాల సహాయకులు సుల్తానా రజియా, భవిత కేంద్ర ఉపాధ్యాయులు ఖాదర్‌బాషా, వెంకట కొండయ్య తదితరులు దివ్యాంగులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం రెండు రోజుల క్రితం దివ్యాంగులకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఎమ్మార్సీ సిబ్బంది విజయ్‌కుమార్,సుబ్బ రాయుడు ఉన్నారు.

ఆళ్లగడ్డ: దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఈఓ శోభావివేకవతి అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక భవిత కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. అనంతరం వివిధ ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఎంఈఓ - 2 గంగాధర్ ఉన్నారు.

దివ్యాంగులను ప్రేమతో చూడాలి



ఉయ్యాలవాడ పాఠశాలలో విభిన్న ప్రతిభావంత విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ

ఉయ్యాలవాడ : సమాజంలో విభిన్న ప్రతిభావంతుల పట్ల ప్రతి ఒక్కరూ ప్రేమతో అక్కున చేర్చుకోవాలని ఎంఈఓ వీరప్రతాప్‌రెడ్డి సూచించారు. మంగళవారం విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక భవిత కేంద్రంలో ప్రధానోపాధ్యాయుడు ఆదాం, రిసోర్స్‌పర్సన్‌లు రఘురామిరెడ్డి, రియాజ్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం విభిన్న ప్రతిభావంతులకు నిర్వహించిన క్రీడల్లో ప్రతిభ కనబరచిన వారికి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. సీఆర్పీలు లక్ష్మిరెడ్డి, సిద్ధమ్మ, లక్ష్మిదేవి పాల్గొన్నారు.

స్కిల్‌హబ్ సెంటర్లలో ఉచిత శిక్షణ

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఉన్న స్కిల్ హబ్ సెంటర్లలో ఉచిత శిక్షణ కార్యక్రమాలు ఈనెల 5వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నంద్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంఐఎస్ డేటా అనలిస్ట్ శిక్షణకు ఇంటర్ చదివి ఉండాలన్నారు. ఎర్రగుంట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, డోన్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల, ఎస్ఏపీ సెంటర్‌లో సీసీ టీవీ, ఇన్‌స్టలేషన్ టెక్నీషియన్, అసిస్టెంట్ సర్వేయర్ శిక్షణకు పదవ తరగతి ఉండాలన్నారు. ఆత్మకూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సాఫ్ట్‌వేర్ ప్రోగ్రాం శిక్షణకు డిగ్రీ అర్హత ఉండాలన్నారు. నందికొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వెబ్ డెవలపర్ శిక్షణకు డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు శిక్షణలో పాల్గొనవచ్చన్నారు. శిక్షణ కార్యక్రమం మూడు నెలలు ఉంటుందన్నారు. కోర్సు పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్, ప్రైవేటు కంపెనీలో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులు విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో రావాలని సూచించారు. వివరాలకు సెల్ : 8297812530 నంబరులో సంప్రదించాలని కోరారు.